RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 110 | మే 14 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 110 | May 14 Thursday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


లిఫ్ట్‌లో మరో చిన్నారి మృత్యువాత

2

# నీట్ దూకుడు

● వివిధ రాష్ట్రాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు .. ● ఐదుగురు నిందితులను అరెస్టు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న తరుణంలో ఈ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) మరింత వేగవంతం చేసింది. ఈ కుంభకోణానికి సంబంధించి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు నిర్వహించిన అధికారులు, ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. రాజస్థాన్, హర్యానా, మహారాష్ట్ర వంటి కీలక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు జరిపిన తనిఖీల్లో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు మరియు కీలకమైన బ్యాంకు లావాదేవీల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం, పరీక్షకు ముందే కొందరు అభ్యర్థులకు ప్రశ్నపత్రం చేరవేసేందుకు మధ్యవర్తుల వ్యవస్థ ద్వారా భారీగా నగదు చేతులు మారినట్లు అధికారులు గుర్తించారు. అరెస్టు అయిన వారిలో ముగ్గురు జైపూర్‌కు చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు గురుగ్రామ్ మరియు నాసిక్ ప్రాంతాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించబడ్డారు.

➤ మిగతా 2వ పేజిలో..

# హైదరాబాద్‌లో ఊబర్ కార్యాలయం

## సీఎంను కలిసిన ఊబర్ సీఈఓ



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తమ ఉనికిని మరింత బలోపేతం చేసే దిశగా ప్రముఖ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్' కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన ఉబర్ గ్లోబల్ సీఈవో దారా ఖోస్రోషాహి, నగరంలో ఇప్పటికే ఉన్న తమ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను మరింత విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా వెలుపల ఉబర్ ఏర్పాటు చేసిన అత్యంత కీలకమైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 600 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు వినూత్న సాంకేతికతపై పనిచేస్తున్నారని ఆయన వివరించారు. ఇదే క్రమంలో, హైదరాబాద్

➤ మిగతా 2వ పేజిలో..

# చైనాకు ట్రంప్

## యుద్ధాలపై చర్చించే చాన్స్



**బీజింగ్ జనసంఘర్షణ**
అంతర్జాతీయ రాజకీయ యవనికపై అత్యంత కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం సాయంత్రం చైనా రాజధాని బీజింగ్ చేరుకున్నారు. 2017 తర్వాత, అంటే దాదాపు తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఒక అమెరికా అధ్యక్షుడు చైనాలో అడుగుపెట్టడం ఇదే తొలిసారి. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, తైవాన్ వివాదం మరియు తీవ్రస్థాయికి చేరిన వాణిజ్య యుద్ధం వంటి ఉత్కంఠభరిత పరిస్థితుల నడుమ జరుగుతున్న ఈ పర్యటనపై ప్రపంచ దేశాల దృష్టి నెలకొంది. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌తో ట్రంప్ జరిపే చర్చలు కేవలం

➤ మిగతా 2వ పేజిలో..

# ఇంధన పొదుపు

## ప్రధాని కాన్వా య్‌లో రెండే వాహనాలు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడం, దేశీయంగా ఇంధన పొదుపు అవశ్యకత పెరగడంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ సంక్షోభ సమయంలో దేశ పౌరులు వృథా ఖర్చులను తగ్గించుకోవాలని పిలుపునిచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్వయంగా ఆచరించి చూపిస్తూ తన భద్రతా కాన్వారులోని వాహనాల సంఖ్యను భారీగా తగ్గించుకున్నారు. ఎస్పీజీ నిబంధనల ప్రకారం కనీసం 12 నుండి 15 వాహనాలు ఉండాల్సిన ప్రధాని కాన్వారును, ప్రస్తుతం కేవలం రెండు వాహనాలకే పరిమితం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. భద్రతా ప్రోటోకాల్‌ను పాటిస్తూనే ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనికి తోడు, కొత్త వాహనాలను కొనుగోలు చేయకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ కార్లను (ఈవం) కాన్వారులో చేర్చాలని కూడా అధికారులకు సూచించారు. ప్రధాని బాటలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వారులోని వాహనాల సంఖ్యను సగానికి పైగా తగ్గించుకున్నారు. కేవలం రెండు వాహనాలతోనే ఆయన ప్రయాణిస్తూ పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నారు. ప్రధాని మోదీ ఇటీవల హైదరాబాద్ పర్యటనలో దేశ ఆర్థిక స్థిరత్వం కోసం ఇంధన వినియోగం తగ్గించాలని, ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించుకోవాలని చేసిన 'ఏడు విజ్ఞప్తులకు' స్పందనగా ఈ చర్యలు మొదలయ్యాయి.

➤ మిగతా 2వ పేజిలో..

# శాంతి భద్రతలు కట్టుదిట్టం

## వివిధ శాఖల అధికారులతో డీజీపీ వీడియో కాన్ఫ రెన్స్



**హైదరాబాద్ జనసంఘర్షణ**
ఈ నెల 27వ తేదీన జరగనున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు, పశువుల అక్రమ రవాణా నిరోధానికి పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పండుగ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పశువుల రవాణా విషయంలో 'కౌ స్లాటర్ యాక్ట్-1977', 'ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978', 'ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960' చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. పశువుల సంతలపై నిరంతర నిఘా ఉంచాలని, రవాణా చేసే పశువులకు సంబంధించి వెటర్నరీ డాక్టర్ల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, గోరక్షక బృందాలు గానీ

➤ మిగతా 2వ పేజిలో..

# బంగారం, వెండిపై భారీగా కస్టమ్స్ డ్యూటీ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పడిపోవడంతో ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచడంతో, గతంలో 6 శాతంగా ఉన్న మొత్తం దిగుమతి సుంకం ఇప్పుడు

➤ మిగతా 2వ పేజిలో..

# శాంతి భద్రతలు కట్టుదిట్టం

**మొదటిపేజీ తరువాయి..** లేదా ఇతర వర్గాలు గానీ ఏదైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప రోడ్లపైకి వచ్చి రాద్ధాంతం చేయకూడదని డీజీపీ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, అవసరమైతే సస్పెక్ట్ షీట్లు కూడా తెరుస్తామని ఘాటుగా స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించి గందరగోళం సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సైబర్ క్రైమ్ విభాగాలకు సూచించారు. మున్సిపల్, పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పట్టుబడిన పశువుల సంరక్షణ కోసం ప్రత్యేక క్యాటిల్ పాండ్‌లను సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి కె. ఇలంబర్తి మాట్లాడుతూ, పండుగ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వెటర్నరీ డాక్టర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని, అన్ని విభాగాలూ అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల డీజీ మహేష్ భగవత్, పలువురు ఐజీపీలు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొని పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలను చర్చించారు.

# హైదరాబాద్‌లో ఊబర్ కార్యాలయం

**మొదటిపేజీ తరువాయి..** శివార్లలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'లో ఉబర్ కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు తమ సంస్థ ఆసక్తిగా ఉందని ఖోస్రోషాహి వెల్లడించారు. ఈ భేటీలో ఉబర్ ఉన్నతాధికారులు మధు కన్నన్, ప్రభ్‌జీత్ సింగ్, ప్రవీణ్ నిప్పల్లి నాగతో పాటు సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక వినూత్న ప్రతిపాదనను ఉబర్ ప్రతినిధుల ముందు ఉంచారు. దేశంలోని మెట్రో నగరాల్లో తీవ్రంగా మారుతున్న పార్కింగ్ సమస్యను పరిష్కరించేలా 'మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్ల' నిర్మాణాన్ని, పార్కింగ్ వ్యాపారాన్ని చేపట్టాలని ఆయన సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉబర్ వంటి సంస్థలు ఈ రంగంలోకి వస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఉబర్ బృందం, దీనిపై సమగ్ర అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ఉబర్ కార్యకలాపాల విస్తరణకు, కొత్త పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# బంగారం, వెండిపై భారీగా కస్టమ్స్ డ్యూటీ

**మొదటిపేజీ తరువాయి..** ఏకంగా 15 శాతానికి చేరింది. బంగారం వినియోగంలో ప్రపంచంలోనే రెండో స్థానంలో, వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉన్న భారత్, తన అవసరాల కోసం ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఈక్విటీ మార్కెట్లలో రాబడులు తగ్గడంతో పెట్టుబడిదారులు పసిడి వైపు మొగ్గు చూపుతున్నారని, గతేడాదితో పోలిస్తే గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు 186 శాతం పెరిగాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెరిగిన సుంకాల కారణంగా దేశీయంగా బంగారం, వెండి ధరలు మరింత భారమై డిమాండ్ తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే దిగుమతులను కట్టడి చేసేందుకు విధించిన 3 శాతం ఐజీఎస్‌టీ కారణంగా ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల కనిష్ఠానికి పడిపోగా, తాజా పెంపుతో పసిడి దిగుమతులు మరింత మందగించే అవకాశం ఉంది. దేశ ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు పొదుపు పాటించాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుకు అనుగుణంగానే ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది.

# చైనాకు ట్రంప్

**మొదటిపేజీ తరువాయి..** ద్వైపాక్షిక సంబంధాలకే పరిమితం కాకుండా, ప్రపంచ భౌగోళిక రాజకీయాలను శాసించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పర్యటనలో ట్రంప్ వెంట అమెరికాకు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల బృందం కూడా ఉంది. ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈవో టిమ్ కుక్, ఎన్విడియా అధినేత జెన్సన్ హువాంగ్ వంటి టెక్ దిగ్గజాలు ఈ పర్యటనలో భాగస్వాములయ్యారు. బీజింగ్ చేరుకున్నట్లు మస్క్ స్వయంగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. సాంకేతిక రంగంలో చైనాతో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించి, భారీ ఒప్పందాలను కుదుర్చుకోవడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అలాగే, ఇరాన్‌పై ఒత్తిడి పెంచి యుద్ధ పరిస్థితులను అదుపులోకి తెచ్చేలా చైనాను ఒప్పించాలని ట్రంప్ భావిస్తున్నారు. బీజింగ్ విమానాశ్రయంలో చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, ట్రంప్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రపంచంలోని రెండు అగ్రరాజ్యాల మధ్య ఈ భేటీ సత్సంబంధాలకు నాంది పలుకుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# నీట్ దూకుడు

**మొదటిపేజీ తరువాయి..** ముఖ్యంగా రాజస్థాన్‌లోని జమ్వా రామ్‌గడ్‌కు చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ అనే సోదరులు ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్నారు. వీరి నివాసాల్లో లభించిన డిజిటల్ ఆధారాలు, అభ్యర్థుల జాబితాలు ఈ నెట్‌వర్క్ లోతును వెలికితీసేందుకు దోహదపడుతున్నాయి. ఇదే క్రమంలో మహారాష్ట్రలో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్న అధికారులు, అభ్యర్థులకు మరియు మధ్యవర్తులకు మధ్య సంబంధాలు ఏర్పరచడంలో వారి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం అంతర్రాష్ట్ర ముఠాల పనిగా భావిస్తున్న సిబిఐ, ఢిల్లీలోని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) కార్యాలయాన్ని కూడా సందర్శించి పరీక్ష నిర్వహణకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను సేకరించింది. మే 3న జరిగిన ఈ పరీక్షలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో ఇప్పటికే ఎన్‌టీఏ పరీక్షను రద్దు చేయగా, ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు దోషులను పట్టుకునేందుకు సిబిఐ అన్ని కోణాల్లో విచారణను ముమ్మరం చేసింది.

# ఇంధన పొదుపు

**మొదటిపేజీ తరువాయి..** ఈ స్ఫూర్తితోనే మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు కూడా తమ కాన్వాయ్‌లను కుదించేందుకు సిద్ధమవుతున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు కూడా ఇంధన ఆదా కోసం వర్క్ ఫ్రమ్ హోమ్, కార్ పూలింగ్ వంటి ప్రత్యామ్నాయాలపై సమీక్షలు జరుపుతున్నాయి. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న ప్రధాని పిలుపుకు అగ్రనేతలు ఇలా ఆచరణలో మద్దతు తెలుపుతున్నారు.

## పోగొట్టుకున్న మంగళసూత్రం భక్తురాలికి అప్పగింత

**దర్శనానికి వెళుతుండగా జారి పడిపోగా గుర్తించిన సెక్యూరిటీ**

**నంద్యాల, మే13 :** ప్రస్తుత మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకుంటున్నాయి. బంగారం కొనడం సామాన్యులకు ఎంతో కష్టంగా మారింది. అలాంటిది.. బంగారు వస్తువు దొరికినప్పటికీ దురాశకు పోకుండా నిజాయితీతో ఆ వస్తువును పోగొట్టుకున్న వారికి అప్పగించారు సెక్యూరిటీ సిబ్బంది. ఈ ఘటన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో చోటు చేసుకుంది. శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనార్థం వచ్చిన ఓ భక్తురాలు ఆలయ ప్రాంగణంలో నడుచుకుంటూ వెళ్తుండగా, ఆమె మెడలోని బంగారు మంగళసూత్రం జారి కింద పడిపోయింది. ఆ సమయంలో అక్కడే విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి మంగళసూత్రం దొరికింది. వెంటనే ఆ బంగారు గొలుసును ఆలయ సూపరింటెండెంట్ గంజి రవికి అప్పగించారు. దీనిపై సమాచారం అందుకున్న చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు వెంటనే అప్రమత్తమై, ఆలయ పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫుటేజీ ఆధారంగా ఆ ఆభరణం ఎవరికి సంబంధించిందో గుర్తించి, సదరు భక్తురాలిని సంప్రదించారు. ఆమె వద్ద తగిన ఆధారాలను సేకరించిన అనంతరం, అధికారుల సమక్షంలో ఆ బంగారు మంగళసూత్రాన్ని ఆమెకు క్షేమంగా అందజేశారు. తమ విలువైన ఆభరణం తిరిగి లభించడంతో భక్తురాలు ఆనందభాష్పాలతో అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీగా వ్యవహరించిన సెక్యూరిటీ సిబ్బందిని సిఎస్ఓ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించగా, ఈ విషయం తెలుసుకున్న ఇతర భక్తులు కూడా వారిని కొనియాడారు

## భారీగా తగ్గిన ప్రధాని కాన్వాయ్ వాహనాలు

**ఇంధన పొదుపుకోసం రెండు కార్లతో మోడీ పయనం**

**ఢిల్లీవీధుల్లో కనిపించిన దృశ్యాలు**

**న్యూఢిల్లీ, మే13**

ప్రధాని మోదీ చెప్పినట్లుగానే తన భద్రతా కాన్వాయ్ కి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన భద్రతా కాన్వాయ్ లో వాహనాల సంఖ్యను భారీగా తగ్గించారు. ఇంధనం పొదుపుకోసం తన కాన్వాయ్ లో 50 శాతం వాహనాలను తగ్గించాలని ఆదేశించిన కొద్దిగంటల్లో అమలు చేసారు. కేవలం రెండు కార్ల కాన్వాయ్ తో ప్రయాణం చేస్తున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్‌లో కేవలం రెండు వాహనాలు మాత్రమే కనిపించడం చర్చనీయాంశమైంది. ఢిల్లీ వీధుల్లో ప్రధాని మోదీ కాన్వాయ్ దృష్యాలు కనిపించాయి. వీటికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని.. ఏడాది పాటు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం లక్ష్యంగా.. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ప్రధాని మోదీ ఆదేశించారు. ప్రధానికి భద్రతగా ఉండే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ లోని కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యను పెంచాలని ప్రధాన మంత్రి సూచించారు. ఇందు కోసం కొత్త వాహనాలను కొనొద్దని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, ఎంపీ సీఎం మోహన్ యాదవ్‌లతో సహా ఇతర మంత్రులు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నారు. అనవసర ప్రయాణాలను తగ్గించాలని, జాతీయ వనరులను పరిరక్షించాలని ప్రధాని ఇటీవల పిలుపునిచ్చిన క్రమంలో బాధ్యతాయుతమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం, పరిపాలనాపరమైన పొదుపు చర్యలు చేపట్టడం వంటి విస్తృత ప్రయత్నాలలో భాగంగా ఈ చర్యను పరిగణిస్తున్నారు.

## లిఫ్ట్‌లో మరో చిన్నారి మృత్యువాత

**గచిబౌలి హాస్టల్‌లో ఐదేళ్ల చిన్నారి మృతి**

**హైదరాబాద్, మే13 :** గచ్చిబౌలిలో తీరని విషాదం చోటుచేసుకుంది. లిఫ్టులో ఇరుక్కుని మరో చిన్నారి మృత్యువాత పడింది. గౌలిదొడ్డిలోని ఒక ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో ఓ బాలిక లిఫ్ట్ లో ఇరుక్కుని మృతి చెందింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక కుటుంబం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి.. గౌలిదొడ్డి లోని మహి ఉమెన్స్ పీజీ హాస్టల్ లో వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారి బిస్తూ గోష్, స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. బుధవారం ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ ఆ చిన్నారి గ్రౌండ్ ఫ్లోర్ నుండి ఐదో అంతస్తుకు వెళ్తున్న క్రమంలో.. మూడవ అంతస్తు వద్ద చిన్నారి జుట్టు లిఫ్ట్ డోర్లలో ఇరుక్కుపోయింది. అది గమనించేలోపే లిఫ్ట్ కదలడంతో.. చిన్నారి తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా.. పోలీసులు, హైడ్రా, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన చిన్నారి మృతదేహాన్ని అత్యంత శ్రమతో బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఉందా? అనే కోణంలో విచారణ సాగుతోంది. ఐదేళ్ల చిన్నారి కళ్లముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

## బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

**ఆయనను రక్షించాల్సిన అవసరం మాకేముంది**

**మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్**

**హైదరాబాద్, మే13 :** పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ఈూఎఖీతో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.


## ఫోక్సో కేసును కులానికి ఆపాదించే యత్నం

**ఇది కుల సమస్య కాదని గుర్తించాలన్న గంగుల**

**హైదరాబాద్, మే13 :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్ విషయంలో బీఆర్ఎస్ భాధితురాలి పక్షాన ఉందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నేతల ఒత్తిడితోనే కేంద్ర మంత్రి కొడుకుపై కేసు నమోదు చేశారన్నారు. బండి సంజయ్ కొడుకు పోక్సో కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కుల సమస్య కాదు. లా అండ్ ఆర్డర్ సమస్య. నిన్న కరీంనగర్ లో బెదిరింపు ధోరణిలో మాట్లాడిన బండి సంజయ్ ఎవరి అంతు చూస్తావ్..? బాధితురాలిని అంతం చేస్తావా, లేకపోతే ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళను అంతం చేస్తావా..? అని గంగుల ప్రశ్నించారు. చట్టానికి, పోలీసులకు బండి సంజయ్ కుమారుడు సహకరించాలన్నారు. కాగా బండి సాయి భగీరథ్‌పై ఇప్పటికే

# ఇల్లందులో లక్ష్మణ్ కుండ్ హనుమాన్ కమిటీ ఆధ్యాత్మిక జైత్రయాత్ర





**❑ భక్తికి నిలయం.. సేవకు మూలం**

ఇల్లందు మే 13 (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణ ఆధ్యాత్మిక చరిత్రలో రెండు నెంబర్ బస్తీలోని 5వ వార్డుకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ వెలిసిన 'లక్ష్మణ్ కుండ్ హనుమాన్ ఆలయం' కేవలం ఒక ప్రార్థనా మందిరం మాత్రమే కాదు, అది భక్తి భావనలు పెనవేసుకున్న ఒక చైతన్య కేంద్రం. నిన్న రాత్రి ఈ ఆలయం నుండి ప్రారంభమైన హనుమాన్ శోభయాత్ర, పట్టణ వీధులను కాషాయమయం చేస్తూ, భక్తుల జయజయధ్వానాల మధ్య అంబరాన్నంటింది. ఈ శోభాయాత్ర ఇల్లందు ప్రజల అచంచలమైన విశ్వాసానికి మరోసారి అద్దం పట్టింది. లక్ష్మణ్ కుండ్ హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలు ఇల్లందులోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా ప్రత్యేక గుర్తింపు పొందాయి. ముఖ్యంగా ప్రతి మంగళవారం ఇక్కడ నిర్వహించే హనుమాన్ చాలీసా పారాయణం ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. వందలాది మంది భక్తులు ఏకకంఠంతో చాలీసా పఠిస్తుంటే, ఆ ప్రాంతమంతా పవిత్ర ప్రకంపనలతో నిండిపోతుంది. క్రమశిక్షణతో కూడిన ఈ పారాయణాలే నేటి భారీ శోభయాత్రకు పునాదిగా నిలిచాయని చెప్పడంలో సందేహం లేదు. ఈ ఆలయ కమిటీ సేవల్లో మరో విశిష్టత 'అన్నదాన గుణం'. ప్రతి మంగళవారం హనుమాన్ చాలీసా అనంతరం భక్తులకు స్వయంగా కమిటీ సభ్యులే దగ్గరుండి రుచికరమైన, శుచికరమైన ప్రసాదాలను తయారు చేసి అందజేస్తారు. ఎటువంటి స్వార్థం లేకుండా, భక్తుడే భగవంతుడనే భావనతో వారు చేసే ఈ సేవ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. కమిటీ సభ్యుల సమన్వయం, సేవా దృక్పథం వల్లే ఈ ఆలయం అతి తక్కువ కాలంలోనే ఇంతటి ప్రాచుర్యం పొందింది. గత చరిత్రను తిరగేస్తే, ఇల్లందులో ప్రతి ఆధ్యాత్మిక వేడుక ఒక జనసందోహంలా మారుతుంది. గతంలో జరిగిన భారీ హిందూ సమ్మేళనం ఇక్కడి ఐక్యతకు నిదర్శనం. అలాగే, గత హనుమాన్ జయంతి సందర్భాల్లో నిర్వహించిన బైక్ ర్యాలీలు యువతలో ధర్మం పట్ల ఉన్న మక్కువను చాటిచెప్పాయి. ఆ పరంపరను



కొనసాగిస్తూ, లక్ష్మణ్ కుండ్ హనుమాన్ ఆలయం నేడు భక్తికి ఒక కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. నిన్నటి శోభయాత్రలో చిన్న పిల్లలు తమ నృత్యాలతో పెద్దలను సైతం మైమరిపించారు. ఆధునిక కాలంలో పిల్లలు స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్న తరుణంలో, వారిని ఇలాంటి ఆధ్యాత్మిక ఊరేగింపుల్లో భాగస్వాములను చేయడం గొప్ప విషయం. ఇది కేవలం వేడుక మాత్రమే కాదు, మన సంస్కృతిని తర్వాతి తరానికి భద్రంగా చేరవేసే ఒక వారధి. పట్టణ వీధుల్లో మోగిన 'జై శ్రీరామ్' నినాదాలు ప్రతి హిందూ హృదయంలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. లక్ష్మణ్ కుండ్ హనుమాన్ కమిటీ చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందే. ఆలయ అభివృద్ధికి, ధర్మ ప్రచారానికి వారు చూపుతున్న చొరవ అసామాన్యం. భక్తులకు కనీస సౌకర్యాల కల్పన నుండి, పండుగలను అత్యంత వైభవంగా నిర్వహించడం వరకు ప్రతి విషయంలోనూ వారి ముద్ర కనిపిస్తోంది. ఒక సామాన్యమైన వార్డులో ఉన్న ఆలయాన్ని, పట్టణ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడం వెనుక కమిటీ సభ్యుల నిరంతర శ్రమ దాగి ఉంది. ఇప్పటి వరకు ఎవరైనా ఈ లక్ష్మణ్ కుండ్ హనుమాన్ ఆలయాన్ని దర్శించకపోతే, తప్పక సందర్శించాలని లక్ష్మణ్ కుండ్ హనుమాన్ కమిటీ తెలియజేశారు. ముఖ్యంగా మంగళవారం సాయంత్రం వేళ ఇక్కడికి వస్తే, భక్తి అంటే ఏమిటో, సేవ అంటే ఏమిటో కళ్ళారా చూడవచ్చు. స్వామి వారి దివ్య దర్శనం మనసుకు ప్రశాంతతను ఇస్తే, అక్కడి వాతావరణం మనలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. ఇల్లందు ప్రజల భక్తికి, లక్ష్మణ్ కుండ్ కమిటీ సేవా తత్పరతకు నిన్నటి శోభయాత్ర ఒక విజయ సంకేతం. భక్తి అనేది ప్రదర్శన కాదు, అది ఒక అనుభూతి అని ఈ ఆలయం నిరూపిస్తోంది. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడమే కాకుండా, ధర్మబద్ధమైన సమాజ నిర్మాణానికి తోడ్పడతాయి. ఇల్లందులో ఆధ్యాత్మిక జ్యోతి నిరంతరం వెలుగుతూనే ఉండాలని ఆశిద్దాం.

# అంగన్‌వాడీలను పాఠశాల విద్యా వ్యవస్థలో విలీనం చేయాలి

**❑ ఎస్సీఈఆర్టీ ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్‌కు ఏఐఎస్ఓ తెలంగాణ ఏఐఎస్ఓ సమర్పించిన అభ్యర్థన.**

హైదరాబాద్,కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 13 (జన సంఘర్షణ):

తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తీసుకువచ్చి, ప్రీ-ప్రైమరీ విద్యను బలోపేతం చేయాలని ఏఐఎస్ఓ తెలంగాణ కన్వీనర్ జి.రమేష్ నాయుడు, ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి డైరెక్టర్ వారికి వినతిపత్రం అందచేసారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలు సరైన ప్రీ-ప్రైమరీ విద్య లేకుండానే మొదటి తరగతిలో చేరుతుండగా, పట్టణ ప్రాంతాల ప్రైవేట్ పాఠశాలల పిల్లలు నర్సరీ, కిండర్‌గార్టెన్ విద్యను అభ్యసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీంతో ప్రారంభ దశలోనే విద్యా అసమానతలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



అంగన్‌వాడీ కేంద్రాలను సమీప ప్రభుత్వ పాఠశాలలతో అనుసంధానం చేస్తే 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం, పోషకాహారం, సమగ్ర అభివృద్ధి కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ చర్య ద్వారా గ్రామీణ పిల్లలు పట్టణ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడగలరని, ప్రీ-ప్రైమరీ నుండి ప్రాథమిక విద్యకు సులభ మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే బోధన నాణ్యత, ఉపాధ్యాయ శిక్షణ, విద్యా ఫలితాలు మెరుగుపడటంతో పాటు జాతీయ విద్యా విధానం-2020 అమలుకు దోహదపడుతుందని అన్నారు. అదనంగా, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీల విలీనంతో గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు పునాది దశ నుంచే సమాన విద్యావకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జి. రమేష్ నాయుడు కన్వీనర్, ఏఐఎస్ఓ తెలంగాణ, కందూరు వీరారెడ్డి, ఎండి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు 86% ఉత్తీర్ణత సాధించడం గర్వకారణం

**❑ మండల విద్యాధికారి రామకృష్ణ.**

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 13 (జన సంఘర్షణ):

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండల ప్రభుత్వ పాఠశాలలు ఈ ఏడాది పదో తరగతి (ఎస్ఎస్సి) ఫలితాల్లో విశేష ప్రతిభ కనబర్చాయని మండల విద్యాధికారి ( ఎంఈఓ ) రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 86 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. 2026, ఎస్ఎస్సి పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన 29 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల ప్రతిభను మరోసారి చాటిచెప్పారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన సదుపాయాలతో పాటు పూర్తిగా ఉచిత విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు మరింత విశ్వాసం పెంచుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "సున్నా ఖర్చుతో ఉత్తమ విద్య అందించే వేదిక ప్రభుత్వ పాఠశాలలే" అని పేర్కొన్నారు. ఎస్ఎస్సి పరీక్షల్లో 500కు పైగా మార్కులు



సాధించిన విద్యార్థులను కామరాజు అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ( డీఈవో)తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని వెల్లడించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఎంఈఓ రామకృష్ణ అభినందించారు. రాబోయే సంవత్సరాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించి బాచుపల్లి మండల ప్రభుత్వ పాఠశాలలు జిల్లాకు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మానుకోట గ్రంథాలయ చైర్మన్‌గా వెన్నం శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు

**❑ ఇల్లందు కాంగ్రెస్ శ్రేణుల ఘన సన్మానం**

ఇల్లందు మే 13 (జన సంఘర్షణ)



మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన వెన్నం శ్రీకాంత్ రెడ్డిని బుధవారం జిల్లా కేంద్రంలో ఇల్లందు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డ డేనియల్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన శ్రీకాంత్ రెడ్డికి పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ, శాలువాలు పూలమాలలతో ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా దొడ్డ డేనియల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి వెన్నం శ్రీకాంత్ రెడ్డి చేసిన సేవలకు దక్కిన సరైన గుర్తింపు ఇదని కొనియాడారు. ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే ఆయన నాయకత్వంలో మానుకోట జిల్లాలోని గ్రంథాలయ వ్యవస్థ సరికొత్త పుంతలు తొక్కుతుందని, విద్యార్థులకు, నిరుద్యోగులకు మరింత చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెండ్యాల హరికృష్ణ, పర్రె శ్రీనివాస్, బెల్లంకొండ శ్రీనివాస్, మేకల శ్యామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో విద్యా వారోత్సవాల సంబరం

**❑ టాపర్లకు చైర్‌పర్సన్ ఘన సన్మానం**

ఇల్లందు మే 13 (జన సంఘర్షణ)




ఇల్లందు, టేకులపల్లి మండలాల్లో బుధవారం నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్ పాల్గొని, పదో తరగతి టాపర్లను ఘనంగా సన్మానించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచడం గర్వకారణమని కొనియాడారు. 559 మార్కులతో టాపర్‌గా నిలిచిన అయేషా ఫాతిమా, 530 మార్కులు సాధించిన హర్షితను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ లు ఉమాశంకర్, జగన్, కౌన్సిలర్లు జాఫర్, సైద్ మియా, భారతి, కార్తిక్ యాదవ్, కిరణ్, సోనీ భాయ్, రాధా కమల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ విద్యా పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# ఇల్లందులో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ: మొక్కజొన్న కొనుగోళ్లపై ఆరా

ఇల్లందు మే 13 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఇల్లందు మార్కెట్ యార్డ్, రెపల్లెవాడ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సరుకు నిల్వ సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు గన్ని బ్యాగులు, రవాణా, హమాలీల కొరత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్.. అకాల వర్షాల నేపథ్యంలో సరుకు తడవకుండా సమీపంలోని ఫంక్షన్ హాళ్లు, ప్రభుత్వ భవనాలకు తరలించాలని ఆదేశించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, సర్పంచ్ బానోత్ శారద, ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

# గర్భిణీలకు 'యోగ' రక్ష.. సిజేరియన్లకు చెక్

ఇల్లందు మే 13 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచి, పేద మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న శస్త్రచికిత్సల ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా వైద్య యంత్రాంగం నడుం బిగించింది. బుధవారం ఇల్లందు మండలం రొంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేవలం మందులు ఇవ్వడమే కాకుండా, గర్భిణీలను మానసిక వత్తిడి నుంచి దూరం చేస్తూ నార్మల్ డెలివరీకి సిద్ధం చేసేలా 'మోటివేషనల్ వాట్సాప్ గ్రూపుల' ద్వారా ప్రతిరోజూ ఉదయం యోగాసనాలు వేయించాలని ఆయన వినూత్న పిలుపునిచ్చారు. ప్రసవ సమయంలో ఆపరేషన్ల అవసరం లేకుండా ఉండాలంటే గర్భిణీలకు యోగా ఒక వరమని, దీనిపై ఆశా కార్యకర్తలు, నర్సింగ్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగే అనవసర ఖర్చులను అరికట్టడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరిస్తూ.. అనుమతి లేకుండా గైర్హాజరైన ఒడ్డుగూడెం సిబ్బందికి మెమోలు జారీ చేశారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే సిబ్బంది ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిబద్ధతతో పనిచేయాలని, సామాన్యుడికి సర్కారు వైద్యం భరోసానివ్వాలని డీఎంహెచ్ఓ ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

# శాంతి మంత్రం.. భద్రతా యంత్రం: బక్రీద్ వేళ పోలీసుల పహారా





**కొత్తగూడెం మే 13 (జన సంఘర్షణ)**

పండుగలు అనేవి కేవలం సంబరాలు మాత్రమే కాదు, అవి సమాజంలోని ఐకమత్యానికి, శాంతికి నిలువుటద్దాలు. రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్, కేవలం భద్రతా సమీక్ష మాత్రమే కాదు, అది శాంతియుత సహజీవనం కోసం జరుగుతున్న ఒక ముందస్తు ప్రయత్నం. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొని, భద్రాద్రి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. చట్టం తన పని తాను చేయడమే కాకుండా, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రశాంతత సాధ్యమని ఈ సమీక్ష స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా ఈ పండుగ వేళ పశువుల అక్రమ రవాణా అనేది ఒక సున్నితమైన అంశం. దీనిని నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా 24/7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతర నిఘా ఉంచాలని డీజీపీ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మునిసిపల్, రెవెన్యూ విభాగాలతో సమన్వయం పాటిస్తూ, ఎక్కడా ఘర్షణలకు తావు లేకుండా చూడటమే పోలీసుల ప్రథమ కర్తవ్యం. అధికారులు ఎంత అప్రమత్తంగా ఉన్నా, ప్రజలు కూడా చట్ట పరిధిని దాటకుండా పండుగ జరుపుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఎక్కడో ఒక చిన్న పొరపాటు జరిగినా అది మత సామరస్యానికి విఘాతం కలిగించకూడదన్నదే ఈ నిరంతర పహారా ముఖ్య ఉద్దేశం. నేటి డిజిటల్ యుగంలో సమాచారం ఎంత వేగంగా వెళుతుందో, తప్పుడు ప్రచారాలు అంతకంటే వేగంగా విషం చిమ్ముతున్నాయి. ఈ క్రమంలోనే సైబర్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని డీజీపీ సూచించడం గమనార్హం. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. ఒకరి మనోభావాలను దెబ్బతీసేలా చేసే ప్రచారం చివరకు సామాజిక విచ్ఛిన్నానికి దారితీస్తుందని ప్రతి పౌరుడూ గ్రహించాలి. వదంతులను నమ్మడం కంటే నిజాలను తెలుసుకోవడమే నాగరిక లక్షణం. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ యంత్రాంగం నిర్ణయించింది. శాంతి అనేది ఒక వైపు నుంచి వచ్చేది కాదు. అది మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, ప్రతి సామాన్యుడి సహకారంతోనే సాధ్యమవుతుంది. జిల్లాలో ఇప్పటికే శాంతి కమిటీలతో సమావేశాలు నిర్వహించడం ద్వారా సామరస్య వాతావరణానికి బాటలు వేశారు. సీసీ కెమెరాల కళ్లు, పోలీసుల పహారా భౌతిక భద్రతనిస్తే, మన అందరి మధ్య ఉండే ఐకమత్యం మానసిక ధైర్యాన్ని ఇస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉన్న వేళ, పౌరులుగా మనం కూడా క్రమశిక్షణతో కూడిన పండుగ జరుపుకుందాం. ఇదే మనం మన సమాజానికి ఇచ్చే గొప్ప గౌరవం.

# అక్షర సైనికుల ఐక్య గళం.. ఇల్లందులో 'బొగ్గుట్ట ప్రెస్ క్లబ్' ఆవిర్భావం




**ఇల్లందు మే 13 (జన సంఘర్షణ)**

సమాజానికి దిక్సూచిగా నిలిచే జర్నలిజం, ఐక్యతతో కూడిన బాధ్యతను స్వీకరించినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఈ మహత్తర ఆశయంతోనే ఇల్లందు పట్టణంలోని ప్రధాన పత్రికల విలేకరులు మే 13, 2026న పెన్షనర్ భవన్‌లో సమావేశమై, "బొగ్గుట్ట ప్రెస్ క్లబ్"ను ఏర్పాటు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఈ క్లబ్ కన్వీనర్‌గా ఇ. నాగేశ్వరరావు (సాక్షి - 9705348031) ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. ఈ నూతన కమిటీలో ప్రధాన పక్షాలైన ఎస్.ఎల్. శ్రీకాంత్ (ఈనాడు - 9701445638), ఎస్. శ్రావణ్ రెడ్డి (సాక్షి - 9948680557), ఎల్. వీరమోహన్ (ఆంధ్రజ్యోతి - 9908224901), శేషు (నమస్తే తెలంగాణ - 9491936868), బి. నరేష్ కుమార్ (వెలుగు - 9848834400), సి.హెచ్. కుమార్ (మన తెలంగాణ - 9866949093) యూనస్ (సిటీ న్యూస్ - 9949283453) వంటి అక్షర సైనికులు సభ్యులుగా ఉండి, ఇల్లందు ప్రజల గొంతుకగా నిలిచేందుకు సిద్ధమయ్యారు. జర్నలిస్టులు కేవలం వార్తలను రాసే వ్యక్తులు మాత్రమే కాదు, వారు సమాజంలోని లోపాలను ఎండగట్టే నిఘా నేత్రాలు. అలాంటి నేత్రాలన్నీ నేడు ఒకే తాటిపైకి రావడం ఇల్లందు ప్రాంత అభివృద్ధికి శుభసూచకం. ప్రజలు, అధికారులు, సంఘాలు తమ సమస్యలను, ప్రెస్ మీట్ వివరాలను కన్వీనర్ ద్వారా ఈ బృందానికి తెలియజేసి సహకరించాలని కోరుతూ, అక్షరమే ఆయుధంగా ఈ క్లబ్ సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించింది.

# మైదానంలో మెరిసిన భద్రాద్రి వజ్రాలు.. హెచ్‌సిఏ లీగ్‌కు 'చేతన' క్రికెటర్ల ఎంపిక

**భద్రాచలం మే 13 (జన సంఘర్షణ)**

క్రీడ అనేది కేవలం గెలుపోటముల ఆట మాత్రమే కాదు, అది ఒక సాధన.. ఒక తపస్సు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో కూడా మాణిక్యాలు ఉంటాయని, వారికి సరైన శిక్షణ తోడైతే ఆకాశమే హద్దుగా రాణిస్తారని భద్రాచలం 'చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ' మరోసారి నిరూపించింది. హెచ్‌సిఏ టుడే లీగ్ ఖమ్మం జిల్లా జట్టుకు ఈ అకాడమీ నుండి రత్నా ఆరియన్, ప్రసన్న కుమార్, హర్ష వర్ధన్ నాయుడు, సుహాస్ ఎంపిక కావడం కేవలం ఆ నలుగురి విజయం మాత్రమే కాదు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా ముఖచిత్రం మారుతుందనడానికి ఇదొక సంకేతం. ప్రతిభకు పేదరికం గానీ, ప్రాంతం గానీ అడ్డుకాదని, పట్టుదల ఉంటే గల్లీ నుండి ఢిల్లీ వరకు చేరవచ్చని ఈ యువ క్రీడాకారులు నిరూపించారు. కేవలం బ్యాటు, బంతి పట్టడమే కాకుండా, మైదానంలో క్రమశిక్షణను పుణికిపుచ్చుకున్న ఈ వజ్రాలను సానబెట్టిన కోచ్‌లు చరణ్ తేజ, రవితేజల కృషి అభినందనీయం. క్రీడాకారులు తమ మూలాలను మర్చిపోకుండా, నిరంతర శ్రమను నమ్ముకుంటే భవిష్యత్తులో భారత జట్టులోనూ భద్రాద్రి బిడ్డలను చూసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే టుడే లీగ్ జట్టుకు ఖమ్మం జిల్లా తరపున భద్రాచలం యువత ఎంపిక కావడం క్రీడా వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది. అకాడమీలో రాత్రింబగళ్లు శ్రమించిన రత్నా ఆరియన్, ప్రసన్న కుమార్, హర్ష వర్ధన్ నాయుడు, సుహాస్‌లు తమ అద్భుతమైన ఫామ్ మరియు నైపుణ్యంతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించారు. ఈ ఎంపిక వారి క్రీడా జీవితంలో ఒక కీలక మలుపుగా నిలవనుంది.



**కోచ్‌ల శ్రమ.. క్రీడాకారుల నిశ్చయం**

చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ కోచ్‌లు చరణ్ తేజ, రవితేజలు కేవలం శిక్షకులుగా మాత్రమే కాకుండా, మార్గదర్శకులుగా మారి ఈ క్రీడాకారులను తీర్చిదిద్దారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన వసతులు లేవనే సాకును పక్కన పెట్టి, ఉన్న వనరులతోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం వల్లనే ఈ ఫలితం సాధ్యమైంది. క్రీడాకారుల్లోని సహజసిద్ధమైన నైపుణ్యానికి సాంకేతికతను జోడించి వారిని యుద్ధానికి సిద్ధమైన సైనికుల్లా మైదానంలోకి పంపారు.

**గ్రామీణ క్రీడారంగానికి కొత్త ఊపిరి**

సాధారణంగా పెద్ద నగరాల్లో ఉండేవారికే అవకాశాలుదక్కుతాయనే అపోహను ఈ విజయం పటాపంచలు చేసింది. భద్రాచలం వంటి ప్రాంతాల నుండి హెచ్‌సిఏ స్థాయికి ఎంపిక కావడం వల్ల స్థానిక యువతలో కొత్త ఆశలు చిగురించాయి. క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే వారికి ఈ నలుగురు క్రీడాకారులు ఇప్పుడు రోల్ మోడల్స్‌గా నిలిచారు. అకాడమీ సభ్యులు, తల్లిదండ్రులు వీరి విజయాన్ని చూసి గర్వపడుతుండటం విశేషం.

**లక్ష్యం దిశగా ముందడుగు**

ఈ ఎంపిక ఒక ముగింపు కాదు, ఇది ఒక సుదీర్ఘ ప్రయాణానికి ఆరంభం మాత్రమే. ఈ యువ క్రికెటర్లు జిల్లా, రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదగాలని, ఐపీఎల్ వంటి వేదికలపై తమ సత్తా చాటాలని జిల్లా క్రీడాభిమానులు కోరుకుంటున్నారు. క్రీడల్లో రాజకీయాలకు తావులేకుండా, కేవలం మెరిట్ ప్రాతిపదికన ఎంపికలు జరిగినప్పుడు ఇలాంటి నిజమైన ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఈ నలుగురు క్రీడాకారులు భవిష్యత్తులో ఇండియన్ జెర్సీ ధరించాలని ఆకాంక్షిద్దాం.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బండి రమేష్

**హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 13 (జన సంఘర్షణ):**



కూకట్పల్లి నియోజకవర్గం ఏవీబీ పురం మాజీ అధ్యక్షులు దారాసింగ్ కూతురు వివాహానికి కొన్ని అనివార్య కారణాలవల్ల హాజరు కాలేకపోయినా టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మెన్, కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ బుధవారం రోజు ఏవీబీ పురంలోని దారాసింగ్ నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు రంగా మోహన్, రంగమోహన్, ధర్మారావు వాసు, ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ ఆర్డీవోగా ఏ రవీందర్ రెడ్డి

**బాన్స్వాడ/మే 13/(జన సంఘర్షణ)**



బాన్స్వాడ సబ్ కలెక్టర్ విధులు నిర్వహించిన కిరణ్మయి బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఆర్డీవోగా ఏ రవీందర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు.బాన్స్వాడ ఆర్డిఓ గా ఏ రవీందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందించారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ( తుజల్పూర్)



**బీబీపేట్, మే 13 ( జన సంఘర్షణ)**

కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం తుజల్పూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇల్లు 'జంగం బాలకిషన్' నూతన గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా వచ్చినటువంటి ఇందిరమ్మ సభ్యులు కలకుంట్ల రాజు, సయ్యద్ హుస్సేన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అక్కమొల్ల రాజు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ఆన్లైన్ బెట్టింగ్లకు బానిస.. బ్యాంకు మేనేజర్ రూ.1.79 కోట్లకు మోసం

**కామారెడ్డి/మే 13/(జనసంఘర్షణ)**




ఆన్లైన్ బెట్టింగ్లకు యువతనే కాకుండా ఏకంగా ఓ బ్యాంక్ మేనేజర్ తాను పనిచేస్తున్న బ్యాంకులో నకిలీ బంగారాన్ని 16 మంది పేర్లపై పెట్టి వచ్చిన రుణాన్ని తీసుకొని బెట్టింగ్లో పాల్గొని ఉన్న డబ్బులు పోగొట్టుకున్న ఘటన చోటుచేసుకుంది. ఆన్లైన్ బెట్టింగ్కు బానిసైన మెదక్లోని ఆదర్శ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్ యాదం అనిల్, తన భార్యతో సహా 16 మంది పేర్లతో నకిలీ బంగారాన్ని కుదువపెట్టి రూ.1.48 కోట్ల రుణం తీసుకున్నాడు. అంతేకాకుండా, బ్యాంకు ఏటీఎంలలో నిల్వచేసే డబ్బును కూడా తస్కరించాడు. ఈ మోసంలో బంగారం నాణ్యత పరిశీలకుడు శ్రీనివాసచారి కూడా సహకరించినట్లు తెలిసింది. బ్యాంకు సీఈఓ ఫిర్యాదు మేరకు, స్రవంతి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసచారిలను అరెస్ట్ చేసి రిమాండ్కు పంపగా, కామారెడ్డికి చెందిన మేనేజర్ అనిల్ పరారీలో ఉన్నాడు. గతంలోనూ అనిల్ ఇలాంటి మోసాలకు పాల్పడి జైలుకు వెళ్లినట్లు గుర్తించారు.

# లబ్ధిదారులకు బండి రమేష్ చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

**హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 13 (జన సంఘర్షణ):**




కూకట్పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ కి చెందిన 1) సయ్య సుల్తానా సీ/ఓ అబ్దుల్ ఖదీర్ 60,000 రూపాయల చెక్కు, 2) బాలానగర్ డివిజన్ కి చెందిన సిహెచ్ మాణిక్యం సీ/ఓ సిహెచ్ వెంకటేష్‌కి 40,000/- చెక్కులు మంజూరైనవి. ఇట్టి చెక్కులు కమ్మ కార్పొరేషన్ చైర్మన్,కూకట్పల్లి టిపిసిసి ఉపాధ్యక్షులు,జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేసుకోగ 1,00,000/- రూపాయలు మంజూరు అయినవి. అట్టి చెక్కులను బండి రమేష్ చేతులమీదుగా బుధవారం రోజు కూకట్పల్లి నియోజకవర్గం శ్రీ హేమ దుర్గ భవన్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బండి రమేష్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, లక్ష్మణ్ గౌడ్, రామ్ మోహన్ రావు, రంగమోహన్, గోపాల్ చౌదరి, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం

❑ **ముఖ్యఅతిథిగా హాజరైన యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్.**

**హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మే 13 (జన సంఘర్షణ):**



శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్.టి.ఆర్ నగర్ కాలనీలో శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ హాజరై ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి.రామకృష్ణ, మహేష్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతులు మురళీధర్ విజయలక్ష్మి ఇంట్లో దోపిడీ

◆ **దోపిడికి పాల్పడ్డది నేపాల్ ముఠా**




హైదరాబాద్/మే 13/(జన సంఘర్షణ/ వారం రోజుల క్రితమే హైదరాబాద్లో ఐపీఎస్ అధికారి భార్య హత్య చేసి భారీ ఎత్తున నగదు, నగలు ఎత్తుకుపోయిన నేపాల్ మహిళా ఇప్పటివరకు పోలీసులకు చిక్కలేదు. తాజాగా మళ్లీ నేపాల్ ముఠా వృద్ధ దంపతులను మురళీధర్, విజయలక్ష్మి ఇంట్లో దోపిడీక పాల్పడ్డారు. 20 రోజుల క్రితం ఇంట్లో పనివాళ్ళుగా చేరిన నేపాల్ దంపతులు. ఈనెల 11న రాత్రి దంపతులను ఇంట్లో కట్టేసి మత్తుమందు ఇచ్చిన దుండగులు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు హార్డ్ డిస్కను ధ్వంసం చేసిన నేపాల్ ముఠా .వజ్రాలు, బంగారం, వెండి, నగదు ఎత్తుకు వెళ్ళిన నేపాల్ దొంగల ముఠా. సికింద్రాబాద్ జవహర్ నగర్ కౌ కూర్ నేపాలి ముఠా దోపిడీ. దోపిడికి పాల్పడ్డ నేపాల్ దొంగలు ముట్ట తొలత ఢిల్లీ నుంచి అటు నుంచి నేపాల్ వెళ్లినట్లు గుర్తించమని మల్కాజిగిరి డిసిపి రజిత వెల్లడించారు. నకిలీ పేర్లతో తప్పుడు సమాచారంతో ఇంట్లోకి పని కుదిరారు అని మల్కాజ్గిరి డిసిపి వెల్లడించారు. నిందితులు ఇప్పటికే నేపాల్ చేరుకున్నట్లు గుర్తించినట్లు మల్కాజ్గిరి డిసిపి రజిత వెల్లడించారు. నేపాలి మూటలు పట్టుకునేందుకు ఆరు ప్రత్యేక బృందాలతో తీవ్రంగా గాలిస్తున్నట్లు మల్కాజ్గిరి డిసిపి వెల్లడించారు. ఈ దొంగతనం కేసులో 8 మంది దొంగలు పాల్గొన్నట్లు సమాచారం.

## బల పరీక్షలో నెగ్గిన సీఎం విజయ్



తమిళనాడు/మే13/(జన సంఘర్షణ) తమిళనాడు అసెంబ్లీలో ఇవాళ జరిగిన విశ్వస పరీక్షలో విజయ్ నేతృత్వంలోని టివికే ప్రభుత్వం విజయం సాధించింది. బల నిరూపణకు అవసరమైన మెజారిటీ కన్నా అధికంగా విజయ్కి మద్దతు లభించింది. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేల మద్దతుతో బలం పెరిగింది.

## ఆడ శిశువును రూ.మూడు లక్షలకు విక్రయించిన తల్లిదండ్రులు

◆ **మెదక్ జిల్లాలో ఘటన**



మెదక్/మే 13/(జన సంఘర్షణ) కంటే ఆడపిల్లల్ని కనాలి అన్నారు ఓ కవి. కానీ కానీ ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల అంటే కొంతమంది తల్లిదండ్రులకు భారంగా మారింది. కన్నా ఆడపిల్లల్ని విక్రయిస్తున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లా బస్టాండ్ మూత్రశాలలో అప్పుడే పుట్టిన చిన్నారిని పడేసి వెళ్లిపోయారు. కామారెడ్డి జిల్లా బాన్స్వాడ లో నవ శిశువు ను నిర్మానుష ప్రాంతాల్లో పడేసి వెళ్లిపోయారు. తాజాగా మెదక్ జిల్లాలో ఆడపిల్లలు మూడు లక్షల రూపాయలకు విక్రయించిన దంపతులు. చిన్నారిని విక్రయించిన పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన దంపతులు. వారికి ముగ్గురు సంతానము ఉండగా నాలుగవ సంతానం కూడా ఆడపిల్ల పుట్టడంతో వారిని పోషించలేక ఆ చిన్నారిని అమ్మకానికి పెట్టారు. చిన్నారిని మహిళా శిశు సంక్షేమ శాఖకు అధికారులు అప్పగించారు.

## సంగారెడ్డి రూ.2కోట్ల విలువైన గంజాయి పట్టివేత



సంగారెడ్డి/మే 13/(జన సంఘర్షణ) ఒడిశా నుంచి మహారాష్ట్రకు రవాణా చేస్తున్న రూ. రెండు కోట్ల విలువైన నాలుగు కేజీల ఎండు గంజాయిని పటాన్చెరువు కూకట్పల్లి, ఎస్ వొటి పోలీసులు సంయుకత ఆపరేషన్ ద్వారా ఆటకట్టించారు. ఓటర్ రింగ్ రోడ్డు మీదుగా సోమవారం వాహనంలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అంతరాష్ట్ర మదక ద్రవాల విక్రయదారుల ముఠాకు చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారిలో ఉన్నట్లు డీసీపీ శ్రీనివాసరావు చెప్పారు.

## బాన్సువాడ ఇంచార్జ్ బీజేపీ నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ తక్షణ ఆర్థిక సహాయం

పొంతగల్/మే 13/(జన సంఘర్షణ)



పోతంగల్ మండలం పొంతగల్ గ్రామంలో బీజేపీ కార్యకర్త శేట్టి సాయిలు తండ్రి పెద్ద సాయిలు అనారోగ్యంతో మరణించడం జరిగింది. స్థానిక బీజేపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకులు కోనేరు శశాంక్ తక్షణమే స్పందించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు మార్కలి ప్రకాష్ పటేల్, మాజీ వైస్ ఎంపీపీ బాలగంగాధర్ టాక్రె, బూత్ అధ్యక్షులు గోవురు రమేష్, ప్రధాన కార్యదర్శి శెట్టి గంగారాం, కోటగిరి మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ మండలం అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలి

◆ **రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్/మే 13/(జన సంఘర్షణ) ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ ఉబర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయింది. ఉబర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. హైదరాబాద్లో ఉన్న ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ను విస్తరిస్తున్నట్లు ఖోస్రోషాహి తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తిని వ్యక్తీకరించారు. భవిష్యత్తులో మరింత విస్తరణ చేపడుతామని తెలిపారు. అందుకు ప్రభుత్వ సహకారం ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఉబర్ ప్రతినిధులకు సూచించారు. తగిన పార్కింగ్ సౌకర్యాలు లేక మెట్రో స్టేషన్ల వంటి ప్రాంతాల్లో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ముఖ్యమంత్రి గారి సూచనలపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం తెలిపింది. హైదరాబాద్కు సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ గురించి ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాధాన్యతను వివరించారు. గత డిసెంబర్లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయ నిర్మాణానికి దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# వరుస దొంగలతో ప్రజల హడల్..!

◆ **బీర్కూరులో నాలుగు ఇండ్లలో చోరీ**



కామారెడ్డి /బాన్సువాడ శ్రీనగర్/మే 13/(జన సంఘర్షణ) ఉమ్మడి జిల్లాలో దొంగలు వరుస చోరీలతో కలకలం రేపుతున్నారు. నిజామాబాద్ నగరంలోని శ్రీనగర్ కాలనీలో మహిళ మెడలోంచి మూడున్నర తులాల బంగారు గొలుసును బైక్పై వచ్చిన దుండగులు లాకెళ్లారు. వర్ని మండలం శ్రీనగర్లో ఏడు ఇళ్ల తాళాలు పగలగొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్లో 8 ఇళ్లలో దొంగలు పడి బీభత్సం సృష్టించారు. మండల కేంద్రమైన బీర్కూరులో సోమవారం అర్ధరాత్రి 4 ఇళ్లల్లో దొంగలు చొరబడి నగలు, నగదులు దొంగలించుకొని పారిపోయారు. బీర్కూర్ పోలీస్ స్టేషన్లో కావలసినంత సిబ్బంది లేకపోవడంతో ఉన్న కొద్దిమంది సిబ్బందితో పోలీస్ స్టేషన్ కొనసాగుతుంది. దీనివల్ల రాత్రి వేళలో పెట్రోలింగ్ చేయడానికి సరైన సిబ్బంది లేకపోవడంతో ఇదే ఆసరాగా తీసుకొని దొంగలు ఇళ్లల్లో చొరబడి దోసకపోతున్నారు. ముఖ్యంగా తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు దొంగలు. ఇప్పటివరకు బాన్సువాడ, శ్రీనగర్, అన్నా సాగర్లో దొంగతనాలకు పాల్పడ్డారు దొంగల్ని ఇప్పటివరకు పోలీసులు గుర్తించలేకపోయారు. సోమవారం రాత్రి బీర్కూర్లో నాలుగు ఇండ్లలో దొంగతనం జరిగింది. దొంగల కోసం గాలి ఇస్తున్నామంటూ పోలీసులు వెల్లడిస్తున్నారు తప్ప దొంగలు పట్టుకోవడంలో పూర్తిగా విఫ్లమవుతున్నారు. ఇప్పటికే కార్లలో ఉన్న డబ్బులను దొంగలించకపోయిన దొంగలను ఇప్పటివరకు పోలీసులు పట్టించుకోలేదు. ఈ ఘటన జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు పూర్తిగా వెనుకబడి ఉన్నారు. మళ్లీ దొంగతనాలు పెరిగిపోవడంతో ఇంటిని విడిచి బయటకు పోవడానికి ప్రజలు భయపడుతున్నారు. ఇంటికి తాళం వేస్తే వచ్చేసరికి గుల్ల అవుతుందని బాధితులు కంటతడి పెడుతున్నారు. ఇప్పటికైనా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో దొంగతనాలను అరికట్టడానికి ప్రత్యేకంగా ఒక పోలీస్ విభాగం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వరుస ఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## ఘనంగా ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగేష్ పటేల్ జన్మదిన వేడుకలు






పోతంగల్ /మే 13/(జన సంఘర్షణ) నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని పోతంగల్ గ్రామనికి చెందిన ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగేష్ పటేల్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించగా ముఖ్య నాయకులు గంగాధర్ పటేల్ ఠాక్రే డైనమిక్ లీడర్ పబ్బ శేఖర్ సమావేశంలో పాల్గొని కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగేష్ పటేల్ జన్మదిన వేడుకలు ఘనంగా ఆశీర్వదించి విందు భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగాధర్ పటేల్, పబ్బా శేఖర్, గంధపు సాగర్ గంధపు దత్తు, వీరేష్, సందీప్, మాజీ ఉపసర్పంచ్ సుద్దాం వినోద్ అనిల్, కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ లీకేజీలపై కేంద్రానికి కాంగ్రెస్ యువనేత గాదె శివ విజ్ఞప్తి

◆ **"విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు"**



హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 13 (జన సంఘర్షణ): కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న నీట్ పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు పెరుగుతున్న పరిస్థితి విద్యార్థుల ప్రతిభను, నిరుద్యోగుల భవిష్యత్తును దెబ్బతీస్తోందని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం తీవ్రంగా కష్టపడుతున్న సమయంలో మరియు పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు చోటుచేసుకోవడం అవమానకరమని గాదె శివ అన్నారు. ముఖ్యంగా నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల సమయంలో హాస్టళ్లలో పేపర్లు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు రావడం, దీనిపై భద్రతా వ్యవస్థలు, పరీక్షలు నిర్వహించే అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే కఠిన చర్యలు తీసుకొని పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర, ఇతర రాష్ట్రలలో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో విఫలమవుతున్నాయని, కనీసం పోటీ పరీక్షలను అయినా పారదర్శకంగా నిర్వహించి విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని కోరారు. 'నేటి యువత రేపటి మన భవిష్యత్తు అనివారిలో విశ్వాసం, ధైర్యం నింపమని కోరారు'. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా అనేక పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు చోటుచేసుకున్నాయని గుర్తు చేసిన గాదె శివ, అటువంటి చర్యల కారణంగానే విద్యార్థులు, నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. అదే పరిస్థితి మళ్లీ దేశవ్యాప్తంగా పునరావృతం కాకూడదని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కఠిన చర్యలు తీసుకొని పేపర్ లీకేజీల నిర్మూలనకు చర్యలు చేపట్టారని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేశారని ఆయన అభినందించారు. తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆటలాడవద్దని, తల్లిదండ్రుల కష్టాన్ని నీరుగార్చే విధానాలు ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని గాదె శివ విజ్ఞప్తి చేశారు. "ఎంత బలమైన ప్రభుత్వం అయినా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే నిలవదు" అని ఆయన హెచ్చరించారు.

# ఖరీఫ్ రైతులకు శుభవార్త.. పంటల కనీస మద్దతు ధరలు పెంపు

- రైతుల ఆదాయం పెంచే దిశగా కేంద్రం కీలక నిర్ణయం
- కేంద్ర ప్రభుత్వానికి మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు

నంద్యాల, మే 13 జనసంఘర్షణ

అమరావతి, మే 13:దేశ రైతాంగ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయమని ఆయన అభినందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం లక్ష్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా రైతుల్లో నూతన నమ్మకాన్ని పెంచుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఖరీఫ్ పంటల మీరా పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల 60 వేల కోట్ల భారీ వ్యయాన్ని ఆమోదించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పెట్టుబడి ఖర్చుకు కనీసం 50 శాతం లాభం జోడించి మీరా ధరలు నిర్ణయించడం రైతులకు నిజమైన భరోసా కల్పించే చర్యగా అభివర్ణించారు. రైతు కష్టానికి తగిన గిట్టుబాటు ధర కల్పించాలన్న సంకల్పంతోనే పలు పంటల మీరాలను గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. వరి కామన్ రకానికి క్వింటాల్‌కు రూ.72 పెంచి రూ.2441, గ్రేడ్-ఏ వరికి రూ.2461 నిర్ణయించడం రైతులకు లాభదాయకమని తెలిపారు. జొన్నకు రూ.4073, రాగికి రూ.5205, సజ్జలకు రూ.2900, ఉలవలకు రూ.8200, మొక్కజొన్నకు రూ.2410, నువ్వులకు రూ.10,346, సన్‌ఫ్లవర్‌కు రూ.8343, పత్తికి రూ.8667, వేరుశనగకు రూ.7517 వరకు మీరా పెంపు ప్రకటించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న వ్యయభారం, ఎరువులు, విత్తనాలు, కార్మిక ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అన్న దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. రాష్ట్రంలోని రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పూర్తిస్థాయిలో పొందేలా రాష్ట్ర



ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ వ్యవస్థ, మద్దతు ధర అమలు ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతాంగానికి అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలకు రాష్ట్ర రైతుల తరఫున మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసే సత్తా చంద్రబాబుకే సాధ్యం

- ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్.
- నల్లరాళ్లపల్లిలో టిడిపిలో చేరికలు.

కుప్పం,మే 13 (జనసంఘర్షణ):

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించే సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విప్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సలహా మండలి పొలిటికల్ చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం దండికుప్పం గ్రామపంచాయతీకి చెందిన నల్ల రాళ్లపల్లి గ్రామంలో 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారందరికీ తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి ప్రభుత్వ విప్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతు న్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో సైతం 25 పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కుప్పం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి అన్నారు. శ్రీశైలం నుండి కుప్పం నియోజకవర్గముకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను చంద్రబాబు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఉదయ్ కుమార్ నాయుడు, గోపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# క్వారీలో ప్రమాదం, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన జనార్ధన్ నాయక్ మృతి

పుంగనూరు, బుధవారం మే13(జనసంఘర్షణ):

వివరాలు పుంగనూరు మండలం పాలెంపల్లి వద్ద క్వారీలో ప్రమాదానికి గురై జనార్ధన్ నాయక్ మృతి చెందాడు, ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు, ఉన్నారు, బ్రతుకుతెరువు కోసం ఒడిస్సా రాష్ట్రం నుండి, క్వారీ పనుల కోసం, కాంట్రాక్టర్ వర్కర్‌గా పుంగనూరు ప్రాంతంకు రావడం జరిగింది, ఇతనికి ఒక కుమారుడు, ఆయుస్సు నాయక్, 10 ఒక కుమార్తె, అనిషా నాయక్ 5. జనార్దన్ సొంత ఊరు జగమేరిపల్లి, భీష్మగిరి, డిగా గంజాం జిల్లా, ఒడిస్సా రాష్ట్రం, పుంగనూరు మండలం పాలెంపల్లి వద్ద ఉన్న ఏరన్సి కంపెనీ కి సంబంధించిన క్వారీలో పనిచేస్తూ ఈ ప్రమాదానికి గురై మృతి చెందడం జరిగింది. గతంలో కూడా ఈ క్వారీ లో ఇలాంటి ప్రమాదాలు చాలా జరిగాయని ఆ ఘటనలు గోప్యంగా ఉంచి సంబంధిత అధికారులు, స్థానిక



రాజకీయ నాయకుల, చేతివాటంతో ప్రమాదాలు బయటకు రాకుండా సాక్షాదారాలు దొరకకుండా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్వారీలో పనిచేయుటకు లోకల్ వ్యక్తులను ఉపయోగిస్తే వారికి ఇలాంటి ప్రమాదమే జరిగితే, ఇబ్బందులు పడతామని, తమ ఉనికికే ప్రమాదం జరుగుతుందని ఊహించుకుని, బయట రాష్ట్రాల నుండి వర్కర్స్ ను తెప్పించుకుని క్వారీ పనులకు ఉపయోగించుకుంటున్నారు, ఇలాంటి ప్రమాదం ఏదైనా జరిగినప్పుడు, క్వారీ వారికి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుండి బ్రతుకుతెరువు కోసం ఈ క్వారీ పనులకు వస్తే, ప్రమాదాలు జరిగినప్పుడు గుట్టుచప్పుడు కాకుండా సమస్యను పరిష్కారం చేసుకోవచ్చని ఇలాంటి వారిని ఎంపిక చేస్తున్నారని సర్వత్ర విమర్శలు ఉన్నాయి.

# ఎద్దుల బండ లాగుడు పోటీలను ప్రారంభించిన తాటికొండ బుగ్గరాముడు





- వెంగళరెడ్డి పేట గ్రామంలో సందడిగా ఎద్దుల బండ లాగుడు పోటీలు

నంద్యాల, మే 13 (జనసంఘర్షణ):

బండిఆత్మకూరు మండలం వెంగళరెడ్డి పేట గ్రామంలో గణపతి,రాములమ్మ, పోతురాజు వారి ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎద్దుల బండ లాగుడు పోటీలు తిలకించేందుకు వచ్చిన ప్రజలతో సందడిగా మారాయి. బుధవారం జరిగిన ఈ క్రీడా పోటీలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యూనిట్ ఇంచార్జి నంద్యాల 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పట్ల మక్కువను క్రీడా స్ఫూర్తిని చాటే ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పోటీల్లో పాల్గొన్న ఎద్దుల జట్టు యజమానులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.తనను గౌరవంగా ఆహ్వానించిన వెంగళరెడ్డి పేట గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, గ్రామస్తులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో రెండు పరిశ్రమల ద్వారా 30 వేల మందికి ఉపాధి కల్పిస్తాం...

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్



(జనసంఘర్షణ):

ఎస్ఆర్ పురం మండలంలో 1000కోట్లతో పాలిహౌస్ పరిశ్రమ నిర్మించి 15,000 మందికి ఉపాధి కల్పిస్తాం. గంగాధర్ నెల్లూరు మండలంలో 1000కోట్లతో మరో పరిశ్రమ... నిర్మించి 15,000 మందికి ఉపాధి కల్పిస్తాం. నియోజకవర్గంలో చదువుకున్న యువతికి మొదటి ప్రాధాన్యత కల్పించడానికి కృషి చేస్తున్నాం. ఇది మాటల ప్రభుత్వం కాదు మంచి ప్రభుత్వం.. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు అనంతరం. ఎస్ ఆర్ పురం మండలం శెట్టివానత్తం గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఎస్ఆర్ పురం సహకార సంఘ చైర్మన్ నిరంజన్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, బాలాజీ నాయుడు రాజశేఖర్ నాయుడు జిల్లా కార్యనిర్వ కార్యదర్శి తరుగు పూర్ణిమ బాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మునిరత్నం రెడ్డి, మురళీధర్ రెడ్డి, మునిరెడ్డి రఘునాథ రెడ్డి నాగరాజ రెడ్డి షణ్ముగ రెడ్డి, మాజీ సర్పంచ్ కుప్పయ్య సింగల్ విండో డైరెక్టర్ నాగరాజ్ జనసేన మండల ఉపాధ్యక్షుడు చందు, జలంధర్ నాయుడు, జ్యోతి నాయుడు,మాజీ సర్పంచ్ మణి దేవా రాజులు నాయుడు, నాగరాజు చిన్నబ్బ రాజు,వంశీ లోకయ్య, తాసిల్దార్ లోకనాథ పిళ్లై ఎంపీడీవో వనజ కార్వేటి నగరం ఎస్సై తేజస్విని పాల్గొన్నారు.

# మోటర్ సైకిల్ ను కారు ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలు

తవణంపల్లి మె 13 (జనసంఘర్షణ):

తవణంపల్లి మండలంలోని అరగొండ చిత్తూరు రహదారిపై బుధవారం ఉదయం 9:45 నిమిషాలకు, గల్లా వాళ్ల ఊరు గ్రామం సమీపంలో చిత్తూరు నుండిఅరగొండ వైపు రిజిస్ట్రేషన్ నెంబర్ AP 03 BS 7311 గల నిందితుడైన కారు డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా అరగొండ వైపు నుండి చిత్తూరుకు వెళు తున్నయమహా మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్ నెం .AP 03 CA 6991 గల మోటార్ సైకిల్ రాంగ్ రూటు కుట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్ననడుపుతున్న మురళి, అతనితోపాటు వెనుక కూర్చున్న చరణ్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే కింద పడిపోవడం జరిగింది. వారు పైకి లేవలేని స్థితిలో స్థానికులు తెలిపిన వివరాలుమోటార్ సైకిల్ నడుపుతున్న మురళి అనే వ్యక్తికి కుడి చేయి కుడికాలు మరియు పాదానికి తీవ్ర రక్తస్రావ గాయాలయ్యాయి. అలాగే వెనుక వైపు కూర్చున్న చరణ్ అనే వ్యక్తి కూడాకుడి కాలికి తీవ్ర రక్తస్రావ గాయాలు కావడంతో, వెంటనే వారిని అత్యవసర వైద్య చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

# అర్ధగిరిలో వీరాంజనేయ స్వామి ఆలయంలో వసంతోత్సవంలో ఆలయ సిబ్బంది

తవణంపల్లి మే 13 (జనసంఘర్షణ):



తవణంపల్లి మండలం అరగొండ శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా వసంతవోత్సవం జరుపుకున్నారు. బుధవారం 9 గంటలకు స్వామివారికి వసంతఉత్సవములు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొని ఆలయ సిబ్బంది కోలా అలంగా వసంతోత్సవాలతో మునిగి తేలారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎ.రఘుపతి వారి ఫ్యామిలీ సభ్యులు ఈఓ మునిశేఖర్ భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తుల సేవలో టిటిడి ఉద్యోగులు తరించాలి

- సైకాలజిస్ట్- డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి



తిరుపతి/ మే 13 (జనసంఘర్షణ):

భక్తుడే భగవంతుడు అన్న భావనతో టిటిడి ఉద్యోగులు వ్యవహరించాలని సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి సూచించారు. బుధవారం శ్వేత భవనంలో శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతూ భక్తుల సేవలో తరించాలని కోరారు.తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హిందువుల విశ్వాసానికి కేంద్రం అన్నారు. ప్రతి రోజు వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం ఎన్నో కష్టాలు పడి తిరుమలకు చేరుకుంటారని చెప్పారు. అలాంటి భక్తులతో టిటిడి ఉద్యోగులు మరింత వినయం, సహనం, సేవాభావంతో ప్రవర్తించడం అత్యంత అవసరం అన్నారు. భక్తుడు ప్రశ్న అడిగితే చిరాకు కాకుండా సమాధానం చెప్పాలి. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చిన కుటుంబాలకు సహాయం చేయాలి. క్యూ లైన్లలో ఇబ్బందులు ఎదురైతే సమస్యను అర్థం చేసుకుని స్పందించాలి" అన్నారు.

టిటిడి ఉద్యోగి ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి మాత్రమే కాదు... శ్రీ వేంకటేశ్వరస్వామి సేవకుడు అనే భావనతో పని చేస్తే భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం మరింత పెరుగుతుందని వివరించారు.తిరుమలలో భక్తుడికి మంచి అనుభవం కలిగితే... అది స్వామివారి మహిమగా గుర్తుండి పోతుందని చెప్పారు. అందుకే "సేవే పరమో ధర్మః" అనే భావనతో ప్రతి ఉద్యోగి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

# మహానాడు ముఖ్య నేతలతో... రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు

తొట్టంబేడు,మే 13 (జనసంఘర్షణ):

నెల్లూరులో జరుగు మహానాడు కార్యక్రమానికి సంబంధించి ముఖ్య నేతలతో కలిసి సమీక్ష సమావేశంలో రాష్ట్ర నాయకులుతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు పాల్గొన్నారు.



# డబుల్ బెడ్రూమ్ గృహాల సమస్యలపై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్ :**
హిమాయత్నగర్లోని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో డబుల్ బెడ్రూమ్ గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కాప్రా ప్రాంతంలోని డబుల్ బెడ్రూమ్ గృహాల్లో లిఫ్టులు పనిచేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గ్రామ పంచాయతీ భూముల్లో లేఅవుట్లు చేసి విక్రయాలు జరుపుతూ, అదే భూములకు రైతుబంధు సాయం కూడా పొందుతున్న అంశంపై విచారణ జరిపించాలని కోరారు. డబుల్ బెడ్రూమ్ గృహాల లబ్ధిదారుల ఎంపికలో స్థానికులకు ప్రాధాన్యత కల్పిస్తూ 50 శాతం కేటాయింపులు చేయాలని సూచించారు. గృహ సముదాయాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా, ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కోరగా, దీనిపై వెంటనే జిల్లా కలెక్టర్తో మాట్లాడాలని మంత్రి అధికారులకు సూచించినట్లు తెలిసింది. గృహ నిర్మాణాల పరిస్థితిని సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రజలకు త్వరితగతిన ఇళ్లను అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల దాడి



**అన్నపురెడ్డిపల్లి :**
అన్నపురెడ్డి పల్లి చెరువు దగ్గర కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో అన్నపురెడ్డి పల్లి ఎస్సై విజయ సింహా రెడ్డి, తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.7,200 నగదు 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వారి పై కూడా కేసు నమోదు చేశామన్నారు. పేకాట నిర్వహణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడిలో ఎస్సై తన సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి నోటీసుపై పాములపాడు గ్రామస్తుల ధిక్కారం

**-వంద మంది సంతకాలతో ఎదురుదాడి..**

**-వివరణ ఇవ్వాలంటూ సెక్రటరీకి వినతి**



**మాడుగులపల్లి:**
నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన నోటీసుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, వాస్తవాలను పరిశీలించకుండా నోటీసులు ఇవ్వడంపై మంగళవారం సుమారు 100 మంది గ్రామస్తులు ఏకమై కార్యదర్శికి వివరణాత్మక లేఖను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

**అసలేం జరిగింది?**

గ్రామంలోని ఒక కాలువ లేదా బాటకు సంబంధించి అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, అది పూర్తిగా ప్రభుత్వ నిర్మితమని, గతంలోనే గ్రామ పెద్దలు, నాటి పంచాయతీ తీర్మానాల ద్వారా ఆ ప్రాంతాన్ని బహిరంగ అవసరాల కోసం కేటాయించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు పంచాయతీ రికార్డుల్లోనే ఉన్నాయని, తమ పూర్వీకులకు దాంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారు. కార్యదర్శి తీరుపై విమర్శలు సొంత గ్రామ రికార్డులను పరిశీలించకుండా, స్థానిక పరిస్థితులపై అవగాహన లేకుండా నోటీసులు పంపడం వెనుక అంతర్యమేమిటని బాధితులు ప్రశ్నించారు. ఈ మేరకు వంద మంది గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేసి, ఇది ప్రభుత్వ స్థలమేనని సాక్ష్యం చెబుతున్నారు అధికారుల నోటీసులకు భయపడేది లేదని, అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు,

**గ్రామస్తుల డిమాండ్**

మా వద్ద ఉన్న సాక్ష్యాధారాలు, గ్రామ పెద్దల స్టేట్మెంట్లను పరిగణనలోకి తీసుకోవాలి. పంచాయతీ రికార్డులను పక్కాగా తనిఖీ చేసి, అనవసరంగా జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలి అని గ్రామస్తులు డిమాండ్ చేశారు. వంద మంది గొంతుకలతో కూడిన ఈ వినతిపత్రం ఇప్పుడు మాడుగులపల్లి మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# కట్ట మైసమ్మ దేవాలయంలో ఎమ్మెల్సీ కోదండరాం ప్రత్యేక పూజలు

**-ప్లీనరీ కి భారీ ర్యాలీతో తరలి వెళ్ళిన జన సమితి నేతలు**

**-పలువురిని ఆకట్టుకున్న కళాబృందాలు**






**హైదరాబాద్, :**
తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం లోయర్ ట్యాంక్ బండ్లోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జలవిహార్లు జరుగుతున్న తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీ సమావేశాలకు పూజలు అనంతరం భారీ ర్యాలీతో తరలి వెళ్లారు. ర్యాలీలో అగ్రభాగాల కోలాటం కళాకారులు, డబ్బు నృత్యాలు, బతుకమ్మలు, బోనాలు ఉండగా ఓపెన్ టాప్ జీపోలో కోదండరాం అభివాదం చేస్తూ ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లీనరి లో పలు రాజకీయ తీర్మానాలు చేసి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ధారిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, కార్మిక విభాగం కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, జన సమితి నాయకులు రామ్ చందర్, జస్వంత్ జైపాల్ రెడ్డి ,రవీందర్ యాదవ్, సుధాకర్,రసూల్, వెంకటయ్య అజయ్ గౌడ్, కార్మిక నాయకులు జహీర్, బాలరాజు, కృష్ణ, బలవంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# ఐజీ కాలనీ సమస్యల పరిష్కారానికి మంత్రి,అధికారులకు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్ :**
చెర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ వాసులు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్యలు ప్రారంభించారు. ఐజీ కాలనీ, చెర్లపల్లి ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాటర్ వర్క్స్ నిర్వహణ సంచాలకుడు అశోక్ రెడ్డి, మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2009లో జేఎన్యూఆర్ఎం పథకం కింద సుమారు 1200 ఇళ్లను నిర్మించగా, అప్పట్లో ఏర్పాటు చేసిన మురుగునీటి వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. దీంతో మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే, 2009లో నిర్మించిన ఇళ్లలో అనేక గృహాల పైకప్పులు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం నెలకొన్నదని, మరమ్మతుల కోసం కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఐజీ కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, మురుగునీటి వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేసి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నెమూరి మహేష్ గౌడ్,కాలనీ అధ్యక్షుడు పర్శురాము యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్, వెంకటేష్, ప్రహ్లాద్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేశ్వర్ రావు,లోక్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్ :**
హనుమాన్ జయంతి సందర్భంగా హబ్సిగూడ ఎన్జీఆర్ఐ పరిధిలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొని ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి వెంకన్న, బజారు పాండు గౌడ్, దేవాలయ కమిటీ సభ్యులు బికుమల్లా అంజయ్య గుప్తా, ఈగ అంజనేయులు, తుమ్మల దేవిరెడ్డి, బుసం రఘునాథ్ రెడ్డి, వర్కాల మదన్ గౌడ్, కడప నర్సింగ్, కిషన్ నాయక్, సంతోష్ కుమా ర్,కాంగ్రెస్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి,రాజన్న, మాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పాములపాడు పశు వైద్యశాలకు గ్రహణం నామమాత్రంగానే సేవలు

**-సిబ్బంది రాక కోసం రైతుల నిరీక్షణ మూగజీవాల ప్రాణాలతో చెలగాటం**



**మాడుగులపల్లి:**
ప్రభుత్వం పశుసంపదను రక్షించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆ లక్ష్యం నీరుగారుతోంది నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామ పశు వైద్యశాల సిబ్బంది పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి ఆసుపత్రికి సిబ్బంది రాకపోవడం, వచ్చినా గంట సేపు కూడా అందుబాటులో ఉండకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,పాములపాడు గ్రామం మండల కేంద్రానికి కొంత దూరంగా ఉండటాన్ని సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది పర్యవేక్షణ చేసే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు,ఉదయం ఆలస్యంగా రావడం, వచ్చిన కొద్దిసేపటికే ఫీల్డ్ విజిట్ పేరుతో ఆసుపత్రికి తాళం వేసి వెళ్లిపోవడం ఇక్కడ నిత్యకృత్యమైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు,ప్రస్తుత వేసవి కాలంలో పశువులకు గొంతువాపు, గాలికుంటు వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంది ఇలాంటి కీలక సమయంలో వైద్యశాల అందుబాటులో లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు పశువులకు అత్యవసర చికిత్స అవసరమైనప్పుడు సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ డాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తోందని

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

గురువారం
14 మే 2026

## రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-ఎస్సై మధుసూదన్ రెడ్డి**



**సంగారెడ్డి:**
సంగారెడ్డి జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని ఎస్సై మధుసూదన్ రెడ్డి సూచించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. యువత అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇది కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తోందని తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్స్ ఉల్లంఘన వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో హెడ్లైట్లు సరిగా ఉపయోగించడంతో పాటు ఓవర్టేక్ సమయంలో జాగ్రత్తలు అవసరమని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఆటోలు, లోడింగ్ వాహనాల డ్రైవర్లు మరింత జాగ్రత్తగా ఉండాలని, పాదచారులు జీబ్రా క్రాసింగ్లను ఉపయోగించాలని కోరారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## తాట్‌పల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం



**జహీరాబాద్**
న్యాల్కల్ మండల పరిధిలోని తాట్‌పల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ జెడ్పీటీసీ భాస్కరెడ్డి, తాట్‌పల్లి గ్రామ సర్పంచ్ చిమ్నాపూర్ రిబుకా నాగేశ్ ఉప సర్పంచ్ సుభాష్ పాటిల్ కలిసి ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అప్పగించారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..**
అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చినందుకు లబ్ధిదారులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి: ఉప్పల్ సీఐ రామలింగారెడ్డి





**ఉప్పల్ :**
ఉప్పల్ బాగాయత్లోని కాల భైరవ టెంపుల్లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉప్పల్ సీఐ వై.రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజలకు సైబర్ మోసాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలనే అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ వై. రామలింగారెడ్డి మాట్లాడుతూ...ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలు, మోసానికి గురైన వెంటనే స్పందించి చేయాల్సిన చర్యల గురించి వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్లైన్కు ఫిర్యాదు చేయాలని, పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాధవ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తూముకుంటలో ఘనంగా గౌతమి - మహేష్ వివాహ వేడుక



**హైదరాబాద్**
మేడ్చల్ జిల్లా తూముకుంటలోని మొగుళ్ళ వెంకట్ రెడ్డి గార్డెన్లో జూపల్లి రాజు, సుజాత దంపతుల కుమార్తె గౌతమి వివాహం మహేష్తో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు తెలంగాణ హై కోర్టు జడ్జి నందికొండ నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా వివాహ కార్యక్రమాలు నిర్వహించగా, వేడుక సందడిగా సాగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కంబోజి వెంకటేశ్వర్లు, జూపల్లి రాజశేఖర్, ఎంఎన్ఆర్ రమేష్, బర్లపాటి జయరాం, జర్నలిస్ట్ లింగాల భూపాల్, ఘణపూరం నర్సింగ్ రావు, హకింపేట్ కృష్ణ, గణపురం రాజు తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.వివాహ వేడుకకు పెద్ద సంఖ్యలో బంధువులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## ఉప్పల్లో హృదయభారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ సేవలు



**ఉప్పల్ :**
వేసవి ఎండలను తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు చల్లని ఉపశమనం అందించేందుకు హృదయభారతి ఛారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా ముగిసింది.మే 1 నుంచి 12 వరకు ఉప్పల్ రింగ్ రోడ్ బస్సు కూడలిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులకు చల్లని మజ్జిగను అందించారు. ఎండ తీవ్రత మధ్య ఈ సేవలు తమ దాహార్తిని తీర్చాయని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని ప్రయాణికులు కోరుతూ నిర్వాహకులను అభినందించారు.హనుమాన్ జయంతి సందర్భంగా మజ్జిగతో పాటు పాయసం పంపిణీ చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డా. మంగళ మక్కపాటి నేతృత్వంలో దాతలు, హృదయభారతి వాలంటీర్ల సహకారంతో సేవా కార్యక్రమం విజయవంతమైంది.ఈ సందర్భంగా డా. మంగళ మక్కపాటి మాట్లాడుతూ వేసవి తాపాన్ని కొంతైనా తగ్గించే సేవ చేయగలగడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి బస్సులోకి వెళ్లి ప్రయాణికులకు మజ్జిగ అందించిన వాలంటీర్లకు ప్రజల నుంచి లభించిన ఆశీర్వాదాలు తమకు మరింత సేవా స్ఫూర్తిని ఇచ్చాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా వివిధ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో సేవలందించిన వాలంటీర్లను హృదయభారతి కార్యాలయంలో శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి ప్రసన్న చైతన్య, మాధవి, హృదయభారతి సిబ్బంది పాల్గొని సేవా కార్యకర్తలను అభినందించారు.

## గంగపుత్ర సంఘం నూతన భవనాన్ని ప్రారంభించిన పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్ :**
రామంతాపూర్ వెంకట్ రెడ్డి నగర్లో గంగపుత్ర సంఘం సభ్యులు తమ సొంత నిధులతో నూతనంగా నిర్మించిన గంగపుత్ర సంఘం భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి హాజరై సంఘ సభ్యులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగపుత్రుల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ భవనం నిర్మాణం పూర్తికావడం ఆనందదాయకమన్నారు. కులవృత్తులను పరిరక్షించుకోవడం, భవిష్యత్ తరాలకు సంప్రదాయాలు, సంస్కృతిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గంగపుత్ర సోదరులకు ఈ సంఘ భవనం అన్ని విధాలుగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వెంకట్ రెడ్డి నగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు చెవురి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి కొంతం సత్యనారాయణ, సెక్రటరీ లక్ష్మయ్య, సలహాదారులు పిల్లి నర్సింహులు, గుర్రం నర్సింహులు, అంబటి శ్రీను, కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటకు హార్టికల్చర్ కళాశాల ఎమ్మెల్యే జారె

**ఎన్నికల హామీ నిలబెట్టుకున్న ప్రజల పన్నిధి జారె**



**అశ్వరావుపేట :**
అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు హార్టికల్చర్ కళాశాలను అశ్వారావుపేటకు తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావించి నిరంతర కృషి ఫలితంగానే ఈ కళాశాల మంజూరు సాధ్యమైందన్నారు. ఈ హార్టికల్చర్ కళాశాల ప్రారంభోత్సవం గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, చేతుల మీదుగా ప్రారంభం కానుంది. అని తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల రైతులు వ్యవసాయ అధికారులు వ్యవసాయ నిపుణులు హాజరుకానున్నారని చెప్పారు. అదేవిధంగా వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి ఆధునిక సాగు విధానాలు రైతుల ఆదాయ వృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హార్టికల్చర్ కళాశాల ఏర్పాటుతో అశ్వారావుపేట ప్రాంత యువతకు నాణ్యమైన వ్యవసాయ విద్య అందుబాటులోకి రావడంతో పాటు రైతులకు సాంకేతిక పరిజ్ఞానం మరింత చేరువ అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రైతు ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కబేళాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 122 పశువులు పట్టివేత

**లారీ సీజ్ చేసిన చంద్రుగొండ పోలీసులు**






**చంద్రుగొండ**
కబేలాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 122 పశువులను పోలీసులు పట్టుకొని గోశాలకు తరలించి కొంతమంది వ్యక్తులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఒరిస్సా రాష్ట్రం నవరంగాపూర్ నుంచి హైదరాబాదు కబేలాలకు తరలించేందుకు కొంతమంది వ్యక్తులు పన్నాగం పన్నారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామపంచాయతీ మహమ్మద్ నగర్ గ్రామంలో పశువులను దంపు చేశారు. ఇదే విషయం చంద్రగొండ పోలీసులకు నమ్మదగిన సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించగా పోలీసులకు 122 పశువులు లభ్యమయ్యాయి అందులో 44 ఆవులు 78 ఎద్దులు ఉన్నాయని వాటన్నిటిని స్వాధీనం చేసుకొని పాల్వంచలోని గోశాలకు తరలించామని ఎస్సై శివరామకృష్ణ, తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పసిపాప కు పునర్జన్మను ప్రసాదించండి

**:- వైద్య ఖర్చులకోసం 30 లక్షల రూపాయలు.**

**:- దాతల సహాయం కోరిన**

**:- వి.ఎస్.ఎస్.ఎస్ ఫౌండర్ అండ్ చైర్మన్ డా.సురభి శ్రీధర్**





**రామగుండం,మే 13 :**
బుడిబుడి అడుగులతో ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్న చిన్నారి వేదశ్రీ ని ఓ మాయదారి రోగం ఇబ్బంది పెడుతుంది.పెద్దపల్లి జిల్లా రామగుండం అయోధ్య నగర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ వీరిశెట్టి శేఖర్ - భవాని దంపతుల కుమార్తె 8 నెలల పాప వేదశ్రీ కి మెదడుకు ఆక్సిజన్ అందక న్యూరో ప్రాబ్లమ్ తో బాధపడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. గత నెల 23న చిన్నారి వేదశ్రీ కి ఫిట్స్ రావడంతో కరీంనగర్ హాస్పిటల్ కి తీసుకోని వెళ్లగా మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్ కొండాపూర్ లోని కిమ్స్ హాస్పిటల్ లో చిన్నారిని అడ్మిట్ చేసి వైద్య సేవలు అందిస్తున్నారు.గత 30 రోజులుగా హాస్పిటల్ ఉంటూ వైద్య సేవలు పొందుతున్న చిన్నారికి వైద్య ఖర్చులకోసం 30 లక్షల రూపాయలు ఖర్చు అవుతాయని వైద్యులు తెలుపగా వైద్య ఖర్చులకోసం చిన్నారి కుటుంబ సభ్యులు దాతల సహకారం కోరుతున్నారు.దాతలు ఎవరైనా ఉంటే చిన్నారి మెరుగైన వైద్యం కోసం సహాయం అందించాలని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ దాతలను కోరారు.సహాయం అందించే వారు 9963142880 నంబర్ కు గూగుల్ పే,ఫోన్ పే ద్వారా సహాయం అందించాలని తెలిపారు.మనం చేసే ఈ సహాయం చిన్నారికి నిండు నూరేళ్ల జీవితానికి పునర్జన్మను ప్రసాదించిన వాళ్ళం అవుతామని సురభి శ్రీధర్ తెలిపారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co